సాక్షి
శ్రీకాకుళం

సోమవారం । 20 । జనవరి । 2025



ఉంటాయో.. ఊడుతాయో

దివ్యాంగ పింఛన్ల పరిశీలన మొదలుకానుంది. ప్రత్యేక వైద్య బృందాలను సిద్ధం చేశారు.

- 8లో



మృత్యువులోనూ..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మిత్రులు మృతి చెందారు. మృతులు ఒడిశా వాసులు.

- 8లో

నేటి నుంచి తెరుచుకోనున్న విద్యాసంస్థలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సంక్రాంతి సెలవులను ముగించుకుని విద్యాసంస్థలు నేడు తెరచుకోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు జనవరి 10 నుంచి, కళాశాలలకు 11 నుంచి సంక్రాంతి సెలవులను ప్రకటించిన విషయం తెలిసిందే. సెలవు రోజుల్లో విద్యాసంస్థలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చైల్డ్‌రైట్స్ కమిషన్, అధికారులు ఆదేశించారు. సెలవులు అనంతరం సోమవారం యథావిధిగా పునఃప్రారంభం కానున్నాయి.

న్యూస్‌రీల్

21న విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారుల ఆత్మీయ సమావేశం



విశ్రాంత విస్తరణాధికారుల కమిటీ సమావేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా విశ్రాంత వ్యవసాయ విస్తరణాధికారుల ఆత్మీయ సమావేశం ఈ నెల 21న 11 గంటలకు ఇల్లీసుపురంలోని ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘ భవనంలో నిర్వహించేందుకు నిర్ణయించినట్లు సంఘం అధ్యక్షుడు కుంచాల ఆదినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ ఆత్మీయ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పాపినాయుడు వస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9542023405, 8179966304 నంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో నిర్వాహక సభ్యులు కె.తవిటయ్య, డి.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీపార్లర్ నిర్వహణపై 30 రోజుల శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 19 నుంచి 45 ఏళ్ల గల 10వ తరగతి విద్యార్హత గల మహిళలకు ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉచిత బ్యూటీపార్లర్ నిర్వహణపై 30 రోజుల శిక్షణ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్న వారు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలని అన్నారు. శిక్షణ కాలంలో వసతి, భోజనం సౌకర్యాలు ఉచితంగా కల్పించనున్నట్లు చెప్పారు.

'తిరుమల ఘటనలకు ప్రభుత్వానిదే బాధ్యత'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పవిత్ర పుణ్య క్షేత్రం తిరుమలలో వరుసగా అపచారాలు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనాల దుర్ఘటన, ఇటీవల యాత్రిక సదన్ పైనుంచి పడి మూడేళ్ల బాలుడు మృతి, తర్వాత లడ్డూ కౌంటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం, రెండో ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం, ఇప్పుడు ఎగ్ బిర్యానీ వంటి వరుస ఘటనలు తిరుమలలో జరగడం అపవిత్రమని, అందుకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. తిరుమల పవిత్రతను కాపాడుదామంటూ చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు భక్తులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పద్మావతి పార్కులో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందితే ఆ కుటుంబాలకు కోటి రూపాయలు ఇవ్వాల్సిన టీటీడీ రూ.25లక్షలు చొప్పున ఇచ్చి చేతులు దులుపుకుందని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, టీడీడీ తిరుమల పవిత్రతను కాపాడాలని కోరారు.

ఉపాధ్యాయ పండితుల సమస్యల పరిష్కారానికి కృషి


శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో ఉపాధ్యాయ పండితుల సమస్యలు పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్(రుప్పా) ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ పండిత పరిషత్ ప్రతినిధులు తమ ఆకాంక్షలు, అభిప్రాయాలను వెల్లడించారు. గాదెకు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు రుప్పా సంఘ ప్రతినిధులు స్పష్టంచేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రుప్పా అధ్యక్షులు పి.రంగన్న, ప్రధాన కార్యదర్శి సోయ నాగేశ్వరరావు, గండేపల్లి మల్లేశు, కె.పద్మావతి, సూర్యారావు, వి.రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి కోసం నిరసన

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలం చిన్నకోరాడలో తాగునీటికి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో వీధిలోని పలువురు మహిళలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు నవంబర్‌లో పనులు చేపట్టారని, అప్పటి నుంచి తమకు తాగునీటి సరఫరా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.

లక్ష్యం.. నిర్లక్ష్యం

- ఆగిపోయిన ధాన్యం కొనుగోళ్లు
- టార్గెట్లు అయిపోయాయంటున్న కొనుగోలు కేంద్రాల సిబ్బంది
- పొలాల్లో, ఇళ్ల లోగిళ్లలో వందలాది బస్తాలు
- లబోదిబోమంటున్న రైతులు





ముద్దాడపేటలో చెత్త సంపద కేంద్రం వద్ద రైతు నిల్వ చేసిన ధాన్యం బస్తాలు

నరసన్నపేట: అన్నదాతల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇస్తామన్న సాయం ఇవ్వక ప్రభుత్వం మోసం చేయడంతో అప్పు చేసి మరీ చాలా మంది సాగు ప్రారంభించారు. అనేక కష్టనష్టాలకు ఓర్చి పంట పండించారు. పండిన పంటను అమ్ముకుందామంటే ఇప్పటికీ ఇబ్బంది తప్పడం లేదు. మొదట్లో కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభం కాక చాలా మంది రైతులు తక్కువ ధరలకు ఇతర జిల్లాల మిల్లర్లకు పంటను విక్రయించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన తర్వాత కొంత వరకూ ఇబ్బందులు తొలగినా తర్వాత వాతావరణం అనుకూలించక పోవడంతో సకాలంలో నూర్పులు చేయలేక పోయారు. ఇప్పుడు వాతావరణం అనుకూలంగా ఉంది. ధాన్యంలో తేమ శాతం నిబంధనలకు వీలుగా ఉంది. పొలాల్లో తోవలు ఏర్పడటంతో రైతులు నూర్పులు చేశారు. అయితే ధాన్యం మాత్రం కళ్లాల్లో, రైతుల ఇళ్లల్లో, పొలాల్లోనే ఉండిపోతోంది. ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం ఉండడం లేదు. 'టార్గెట్లు అయిపోయాయి' మరి కొనలేం అని సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. పొలాల్లో ఉంచితే నీరు వచ్చి తడిచి పోతున్నాయి, ఎలుకలు తినేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.



బాడాంలో గోవిందరావు కళ్లంలో 10 రోజులుగా ఉన్న ధాన్యం బస్తాలు

నరసన్నపేట మండలంలో ఉర్లాం రైల్వే ట్రాక్ దాటి ఏ గ్రామం వెళ్లినా ధాన్యం నిల్వలు కనిపిస్తున్నాయి. రైతులు కంటతడి పెడుతున్నారు. ఇదే పరిస్థితి జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల్లో ఉంది. 10 రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచి పోయాయి. దీనికి ప్రధాన కారణం టార్గెట్లు అయిపోవడమే. ముందుగానే ఈ పరిస్థితి ఊహించి టార్గెట్లు పెంచితే రైతులకు ఈ ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు టార్గెట్ల పేరుతో రైతులను వేధిస్తున్నారు. వ్యవసాయ మంత్రి సొంత జిల్లాలోనే అధికారులు పట్టించుకోకుంటే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. టార్గెట్లు పెంచాలని మండల స్థాయి అధికారులు జిల్లా అధికారులకు తెలియజేస్తున్నా పట్టించుకోవడంలేదు.

జీపీఎస్‌తో కొత్త సమస్యలు

ప్రస్తుతం రైతులు మిల్లులకు ధాన్యం పంపే వాహనాలకు జీపీఎస్ అమలు చేస్తున్నారు. జనవరి ముందు వారం వరకూ జీపీఎస్ లేదు. ఇప్పుడు అమలు చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ధాన్యంతో వెళ్లిన వాహనాలు మిల్లరు లాగిన్‌లో చూపడం లేదు. దీంతో టార్గెట్లు ఉన్న మండలాల్లో కూడా ధాన్యం కొనుగోళ్లు ఆశాజనకంగా లేవు. మిల్లులకు ధాన్యం పంపినా డబ్బులు రావడం లేదు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ సీజన్‌కు జీపీఎస్ విధానం రద్దు చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే జీపీఎస్ పెట్టేందుకు అయ్యే ఖర్చును వాహనదారులే పెట్టుకోవాలని అధికారులు అంటుడంతో వాహనదారులు వ్యతిరేకిస్తున్నారు. గతంలో వాహనాలకు ఉచితంగానే జీపీఎస్‌ను అధికారులు బిగించే వారు. ప్రస్తుతం సమస్యలు దృష్ట్యా జీపీఎస్ విధానం రద్దు చేయాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల్లోనే ధాన్యం

నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల్లో ధాన్యం నిల్వలు గుట్టలుగుట్టలుగా ఉన్నాయి. నరసన్నపేట మండలం బాడాంలో 1180 వరకూ ధాన్యం బస్తాలు ఉన్నాయి. అలాగే ముద్దాడపేటలో వెయ్యికి పైగా ఉన్నాయి. ఇలా సుందరాపురం, దాసరివానిపేట, రావులవలస, పోతయ్యవలస, చెన్నాపురం, బడ్డవానిపేట,నడగాం, లుకలాం, కామేశ్వరిపేట, యారబాడు, నర్శింగపల్లి, కంబకాయ తదితర గ్రామాల్లో ధాన్యం నిల్వలు అధికంగా ఉన్నాయి.



3.90 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోళ్లు..

జిల్లాలో 3,60,225 ఎకరాల్లో వరి పండించారు. ఎకరాకు 33 బస్తాలు చొప్పున కొనుగోళ్లు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 3,90,273 మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారు. వాస్తవానికి జిల్లాకు 4.90 లక్షల మెట్రిక్ టన్నులు టార్గెట్‌గా నిర్ధారించారు. శనివారం సరికి 3,90,273 మెట్రిక్ టన్నులు కొనుగోళ్లు చేశారు. సుమారుగా మరో లక్ష టన్నులు కొనుగోళ్లు చేయాల్సి ఉండగా సిబ్బంది చేయడం లేదు. మండలాలకు, సచివాలయాలకు ఇచ్చిన టార్గెట్లు అయిపోయాయి.. మేమేమీ చేయలేం అని సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. దీంతో రైతులు కంట తడి పెడుతున్నారు. జిల్లాలో 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీని ప్రకారం టార్గెట్లు పెంచి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పొలాల్లో ఉంచలేకపోతున్నాం..



కోతలు చేసిన వెంటనే నూర్పులు చేయడానికి వీలు కాలేదు. పండగ ముందు నూర్పులు చేశాం. ధాన్యం అమ్మకాలకు కొనుగోలు కేంద్రాలకు వెళ్తే టార్గెట్లు అయిపోయాయని అంటున్నారు. రోజూ వెళ్తున్నాం. అయినా ప్రయోజనం లేదు. నా వద్దే 350 బస్తాలు ఉన్నాయి. ఇంట్లో నిల్వకు సదుపాయాలు లేవు. పొలాల్లో ఉంచుదామంటే రబీ వరికి రైతులు నీరు పెడుతున్నారు. ఈ నీరు సమీప పొలాల్లోనికి రావడంతో పొలాల్లో ఉన్న ధాన్యం తడిచి పోతున్నాయి. నానా అవస్థలు పడుతున్నాం.

– డోల గోవిందరావు, బాడాం

పది రోజులుగా కొనుగోళ్లు లేవు



ధాన్యం కొనుగోలు చేసి పది రోజులు దాటుతోంది. ఇంకెన్నాళ్లు ఓపిక పట్టాలి. టార్గెట్ల పేరుతో రైతులను వేధించడం ఎంత వరకూ న్యాయం. ఇప్పటికే బస్తాకు రూ. 300 తక్కువకు చాలా వరకూ అమ్ముకున్నాం. ఉన్న ధాన్యం మద్దతు ధరకు అమ్ముకొని కొంత లాభ పడుదామంటే ఈ విధంగా టార్గెట్ల నేరుతో కాలక్షేపం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– కింతలి చలపతిరావు, దాసరివానిపేట

నేటి నుంచి ఇంటర్ ప్రీ–ఫైనల్



- ఐపీఈ–2024 పరీక్షల ప్రశ్న పత్రాలతో పరీక్షల నిర్వహణ
- పరీక్షలు ముగిసిన వెంటనే దిద్దుబాటు, మార్కులు వెబ్‌పోర్టల్‌లో నమోదు, ఫలితాలపై సమీక్ష
- సంక్రాంతి సెలవులు ముగిసిన వెంటనే పరీక్షలు జరుగుతుండటంతో విద్యార్థుల హాజరుపై డైలమా

బోర్డు ప్రశ్న పత్రాలను వినియోగిస్తున్నాం



జిల్లాలో జరిగే ప్రీ పబ్లిక్ పరీక్షలు ఏర్పాట్లు పూర్తిచేశాం. ఐపీఈ–2024 ఇంటర్‌బోర్డు ప్రశ్న పత్రాల సెట్‌ను వినియోగిస్తున్నాం. ఇందుకు సంబంధించి ప్రిన్సిపాళ్లకు తగు మార్గదర్శకాలను జారీ చేయడం జరిగింది. జవాబుపత్రాలను వెంటనే దిద్దుబాటు చేసి మార్కులను బీఐఈఏపీ వెబ్‌పోర్టల్‌లో నమోదుచేయాలి. ఫలితాలపై సమీక్ష జరుగుతుంది.

– శివ్వాల తవిటినాయుడు, జిల్లా డీవీఈఓ, ఇంటర్మీడియెట్ విద్య

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇంటర్మీడియెట్ ప్రీ–ఫైనల్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి మొదలుకానున్న నేపథ్యంలో ఈలోగా ముందస్తుగా ప్రీ పరీక్షలను నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఇంటర్ విద్య డైరెక్టర్ భావించారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి మొదలయ్యే ప్రీపబ్లిక్ పరీక్షలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రధానమైన జనరల్ కోర్సుల పరీక్షలు జనవరి 20 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయి. ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత దిద్దుబాటు చేయనున్న మార్కులను సంబంధిత సీఎంఆర్ రికార్డుల్లోను, బీఐఈఏపీ వెబ్‌పోర్టల్‌లోను నమోదు చేయనున్నారు.



పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు

ఇంటర్‌బోర్డు ప్రశ్న పత్రంతో..

2023-2024 ఇంటర్ పబ్లిక్ పరీక్షలు గత ఏడాది 2024 మార్చి నెలలో, సప్లిమెంటరీ పరీక్షలు మే నెలలో నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం మూడు సెట్ల ప్రశ్న పత్రాలలో రెండింటిని వినియోగించగా.. ఒక సెట్ మిగిలింది. మిగిలిన ఆ ఒక సెట్ ప్రశ్న పత్రాన్ని ఈ ప్రీ–ఫైనల్ పరీక్షలకు వినియోగించాలని ఇంటర్‌విద్య డైరెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు, ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు ఇప్పటికే ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రశ్న పత్రాలను పోలీస్ స్టేషన్లు(ఎస్‌హెచ్‌ఓ) నుంచి కళాశాలలకు చేర్చారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో జూనియర్ కళాశాలలు 191 ఉన్నాయి. అయితే వీటిలో ఫంక్షనింగ్ జరుగుతున్న కళాశాలలు 164 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, సోషల్ వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 1, మోడల్ స్కూల్/కళాశాలలు 13, కేజీబీవీలు 25, జెడ్పీహెచ్‌స్కూల్ కాలేజీలు 6, కోపరేటివ్ 2 కలిపి 94 కళాశాలల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. వీటిల్లో మొత్తం 24,630 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. వీరంతా ప్రీ–ఫైనల్ పరీక్షలు రాయనున్నారు. అయితే సంక్రాంతి సెలవులు ముగిసి కాలేజీలు తెరిచిన రోజు నుంచి ఈ ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతుండటంతో ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాస్తారో.. ఎంతమంది హాజరవుతారనే విషయంపై అటు అధికారులు, ఇటు ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లలో ఒకింత ఆందోళనతోపాటు డైలమా నెలకొంది.

పంచాయతీ ఉద్యోగి చేతివాటం

- సొంత జేబులోకి ట్రేడ్ లైసెన్స్ ఫీజు డబ్బులు
- మరి కొంత మంది నుంచి ఇంటి పన్ను పేరు మార్పుల కోసం డబ్బులు వసూళ్లు
- నాలుగు నెలలుగా విధులకు డుమ్మా



టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీకి చెందిన ఉద్యోగి ఒకరు తన చేతివాటాన్ని ప్రదర్శించి ట్రేడ్ లైసెన్స్‌కు వసూలు చేసిన ఫీజు డబ్బులను సొంత జేబులోకి వేసుకున్నాడు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే ప్రస్తుతం నిందితుడు నాలుగు నెలలుగా విధులకు డుమ్మా కొట్టడం మరింత చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే...టెక్కలి మేజర్ పంచాయతీలో కారుణ్య నియామకంలో భాగంగా హేమంత్ అనే యువకుడు స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆ యువకుడు కాస్త చదువుకోవడంతో, పంచాయతీకి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల బాధ్యతలను అప్పగించారు. దీంతో అతడు ట్రేడ్ లైసె న్స్ ఫీజులను వసూలు చేసి సొంత అవసరాలకు వినియోగించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు మందలించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సొంత అవసరాలకు వినియోగించుకున్న సొమ్మును తక్షణమే పంచాయతీకి చెల్లించాలని అధికారులు ఆదేశించి కొంత గడువును ఇచ్చారు. అయినప్పటికీ పంచాయతీకి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకపోగా అక్టోబర్ నెల నుంచి నేటి వరకు విధులకు హాజరు కాకపోవడం ప్రస్తుతం పంచాయ తీ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా ట్రేడ్ లైసెన్స్ వసూలు చేస్తున్న హేమంత్‌కు తమ ఇంటి పన్ను పేరు మార్పుల కోసం డబ్బులు ఇచ్చామని ఆయన ఆచూకీ లేదంటూ కొంత మంది పంచాయతీకి చెందిన ప్రజలు తరచూ అధికారు లకు ఫిర్యాదులు చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది హేమంత్ వ్యవహారంపై ఇప్పటికే జిల్లా స్థాయి పంచాయతీ అధికారులతో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఈఓ జగన్నాథం వెల్లడించారు. ఇదిలా ఉండగా గతంలో పంచాయతీ ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో కొంత మంది సిబ్బంది ఇదే మాదిరిగా లక్షల రూపాయలు గోల్ మాల్ చేశారు. మళ్లీ ఇప్పుడు అదే సీన్ రిపీట్‌గా మారింది. తాజాగా జరిగిన వ్యవహారంపై కొంత మంది వార్డు సభ్యులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

ఆసక్తి తగ్గిందా..?



ఎంపిక ప్రక్రియకు హాజరైన అభ్యర్థినులు(ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం అంటే చాలా మంది యువతకు ఇదివరకు దీర్ఘకాలిక స్వప్నంలా ఉండేది. ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్న ఈ ఎంపిక ప్రక్రియ ప్రస్తుతానికి రెండు దశలు దాటింది. ప్రిలిమినరీ పరీక్ష, దేహ దారుఢ్య పరీక్ష, ఇక చివరి రాత పరీక్ష మాత్రమే ఉంది. ప్రిలిమినరీ పరీక్ష అర్హత సాధించిన వారు చాలా మంది ఫిజికల్ టెస్టులకు హాజరు కాలేదు. తుది పరీక్షకు ఎంపికైన వారి సంఖ్య కూడా తక్కువగా ఉంది. ఎక్కువ మందికి ఆసక్తి లేకపోవడం వల్లే గైర్హాజరైన వారి సంఖ్య అధికంగా ఉందని చాలా మంది భావిస్తున్నారు.

వాస్తవంగా కానిస్టేబుల్ పోస్టులకు ఇంటర్మీడియెట్ అర్హత కాగా, ఇంజినీరింగ్, పీజీ, డిగ్రీ చేసిన వారు సైతం దరఖాస్తు చేసుకున్నారు. చాలా మంది ఎంపిక ప్రక్రియకు హాజరయ్యారు. దేహ దారుఢ్య పరీక్షలు ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో డిసెంబర్ నెల 30 నుంచి ఈ నెల 18వ తేదీ వరకు సెలవు రోజుల్లో మినహా నిర్వహించారు. జిల్లా నుంచి ప్రిలిమినరీ పరీక్షల్లో పురుష, మహిళా అభ్యర్థులు 7390 మంది అర్హత సాధించారు. వీరిలో దేహ దారుఢ్య పరీక్షలకు 4952 మంది మాత్రమే హాజరయ్యారు. 2951 మంది తుది రాత పరీక్షకు ఎంపికయ్యారు. ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 2438 మంది దేహ దారుఢ్య పరీక్షలకు ఎంపిక కాలేదు. గతంలో అభ్యర్థులను స్క్రూటినీ చేయటం కోసం ఐదు కిలో మీటర్లు అర్హతగా పరీక్ష నిర్వహించేవారు. 25 నిమిషాల్లో ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో విజేతలకు ఇతర దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించి రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసేవారు. ప్రస్తుతం ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ ద్వారా స్క్రూటినీ చేశారు. వీరికి ఎత్తు, ఛాతీ కొలత, 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ నిర్వహించి అర్హత సాధించిన వారికి తుది పరీక్ష నిర్వహించి, ఉద్యోలకు రిజర్వేషన్ రోస్టర్, కొన్ని పోస్టులకు స్పోర్ట్సు మెరిట్, రాత పరీక్ష ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తున్నారు. ప్రధానంగా ఎక్కువ మంది అభ్యర్థులు ఎత్తు, ఛాతీ కొలత, 1600 మీటర్లు పరుగు పందేంలో అర్హత సాధించ లేకపోయారు. పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియ అన్ని దశలు దాటి వెళ్లాలి. ఎంపికపై స్పష్టమైన నమ్మకం లేని వారు హాజరు కాలేదు. మరోపక్క కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పలు ఆర్మ్‌డ్ ఫోర్స్ ఉద్యోగాలకు వెళ్లిపోయారు. దీంతో గైర్హాజరు సంఖ్య ఎక్కువగా ఉందని నియామక ప్రక్రియలో పాల్గొన్న అధికారులు బావిస్తున్నారు. మరో పక్క ఎంపికైన అభ్యర్థులు కోచింగ్ సెంటర్లలో శిక్షణ, ఆన్‌లైన్ శిక్షణ, బయట ప్రాంతాల్లో గదులు అద్దెకు తీసుకొని ప్రిపరేషన్ ప్రారంభించారు. ఉద్యోగం సాధించాలంటే ఇప్పటికీ తీవ్ర పోటీ ఎదుర్కోవాల్సి ఉంటుంది.

వివాహిత దారుణ హత్య

- శ్రీకాకుళం న్యూకాలనీలో ఘటన
- మృతురాలిది పొందూరు మండలం మొదలవలస



పూజారి కళావతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని న్యూకాలనీలో 53 ఏళ్ల వివాహిత పూజారి కళావతి దారుణ హత్యకు గురయ్యారు. శనివారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు తన స్వగ్రామం పొందూరు మండలం మొదలవలస నుంచి శ్రీకాకుళం నగరానికి తన వస్త్రాలు తెచ్చుకుంటానని స్కూటీపై వచ్చిన ఆమె రోజు గడిచినా ఇంటికి వెళ్లకపోవడం.. ఆదివారం రాత్రి న్యూకాలనీ ఎక్సైజ్ కార్యాలయం సమీపంలోని ఓ బిల్డింగ్ పై ఫ్లోర్ బాత్రూమ్‌లో విగతజీవిగా పడి ఉండటం స్థానికంగా సంచలనం రేపింది. రెండో పట్టణ పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే..

పొందూరు మండలం మొదలవలస గ్రామానికి చెందిన పూజారి వెంకటరావు ఆర్మీలో పనిచేసి రిటైర్ అయ్యారు. అతని భార్య కళావతి. వీరికి ఇద్దరు మగ పిల్లలు, ఓ కుమార్తె ఉన్నారు. ఈమెకు నగరంలో సత్సంగంకు భజనలకు వెళ్లే అలవాటు ఉంది. శనివారం నగరానికి స్కూటీపై వచ్చిన ఆమె రాత్రయినా ఇంటికి వెళ్లలేదు. దీంతో ఆమె సత్సంగానికి వెళ్లి ఉంటారని కుటుంబ సభ్యులు అనుకున్నారు. ఉదయం అక్కడ ఉన్న గురువుకు ఫోన్ చేశాక రాలేదని చెప్పడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.



బాత్‌రూమ్‌లో పడి ఉన్న మృతదేహం

సీసీ కెమెరాలు పరిశీలించడంతో..

ఎక్సైజ్ కార్యాలయం ఎదురుగా ఉన్న వీధి చివరన, మరికొన్ని చోట్ల సీసీ కెమెరాలు పరిశీలించగా చైతన్య కళాశాల వద్ద ఆమె స్కూటీ ఆపి పార్క్ చేయడం, అక్కడి నుంచి నడుచుకుంటూ వచ్చి రెడ్డిమ్ ఎంటర్‌ప్రైజెస్ బిల్డింగ్ ఒకటో ఫ్లోర్‌కు మెట్లెక్కుతూ ఉండటం సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యింది. ఆ తర్వాత ఆమె దిగడం రికార్డు కాలేదు. దీంతో రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు తన సిబ్బందితో పాటు క్లూస్ టీమ్‌తో పై ఫ్లోర్ రూమ్‌లోకి వెళ్లి చూడగా పక్కనే ఉన్న బాత్రూమ్‌లో కళావతి విగతజీవిగా పడి ఉంది. పరిసరాలన్నీ పరిశీలించగా బాత్‌రూమ్ పక్కన ఉన్న గదిలో బెడ్ ఉండటం, దానిపై రెండు తలగడల్లోని ఓ తలగడపై రక్తపు మరక ఉండటం, కళావతి ముక్కు నుంచి కూడా రక్తం కారి ఉండటాన్ని బట్టి హత్యగా భావించి పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఆమె వచ్చిన బిల్డింగ్ ఓనర్ సూరిబాబు అనే వ్యక్తి. అందులో పై ఫ్లోర్‌లో అండలూరి శరత్‌కుమార్ అనే యువకుడు అద్దెకు ఉంటున్నాడు. ఆ వ్యక్తితో గత కొంతకాలంగా ఆమె సన్నిహితంగా ఉంటున్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

జీవన్‌రావుకు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న హనుమంతు జీవన్‌రావు

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడు సి పంచాయతీ పరిధిలోని బంజీరు గ్రామానికి చెందిన ఇంజినీర్ హనుమంతు జీవన్‌రావుకు అరుదైన గౌరవం దక్కింది. ఆదివారం జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరుగుతున్న బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 37వ జాతీయ కన్వెన్షన్ ఆఫ్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ సదస్సులో జీవన్‌రావును యువ ఇంజనీర్ అవార్డుతో సత్కరించారు. జీవన్‌రావు ఇక్కడే ఏరోస్పేస్ సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రైతు కుటుంబానికి చెందిన యువకుడికి అవార్డు దక్కడం పట్ల గ్రామస్తులు, తల్లిదండ్రులు హనుమంతు సాంబయ్య, సంజీవమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

బుడుమూరులో మురుగునీటిపై ఆరా



కాలువను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఇప్పిలి వెంకటరమణ

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరులో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని డీఎల్‌పీవో ఇప్పిలి వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. మురుగునీరు పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ బీసీ కాలనీ వాసులు శనివారం కాలువలో దిగి ధర్నా చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు ఆదివారం గ్రామానికి వెళ్లి పారిశుద్ధ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ఇక్కడ కాలువనీరు బయటకు పోయేందుకు ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. మురుగునీరు లేకుండా పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, స్థానిక నాయకులు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న జీడి రైతులు

పలాస: ఉద్దానం ప్రాంత జీడి రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని జీడి రైతాంగ పోరాట ప్రతినిధులు డిమాండ్ చేశారు. బైపల్లి గ్రామంలో కోనేరు కామేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి మద్దతు ధర విషయంలో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్యరూపం దాల్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో జీడి పిక్కల గిట్టుబాటు ధర విషయంలో చర్చలు జరపడానికి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, కోనేరు రమేష్, బత్తిన లక్ష్మీనారాయణ, అంబటి రామకృష్ణ, కొర్ల హేమారావు చౌదరి, వాసుపల్లి సాంబమూర్తి, జోగి అప్పారావు, తెప్పల చాణక్య, బొంపెల్లి శివకుమార్, గుల్ల ఈశ్వరరావు, సానా కృష్ణారావు, తామాడ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

సవరణ జీఓ 117లో లోపాలు సరిదిద్దాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జీఓ 117 సవరణలో లోపాలను సరిదిద్ది విద్యావ్యవస్థను కాపాడాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూల్ పంచాయతీ కేంద్రంగా ఏర్పాటు చేయడం శుభపరిణామమే అయినా సమీప పాఠశాలల నుంచి మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ ప్రైమరీ స్కూల్లో కలపకుండా వాటిని పాతపద్ధతిలో ప్రైమరీ స్కూల్‌గానే కొనసాగించాలని కోరారు. మోడల్ ప్రైమరీ స్కూలు పంచాయతీ కేంద్రంగా ఉండాలని, అప్‌గ్రేడ్ కాకుండా మిగిలిన యూపీ స్కూలును యథావిధిగా కొనసాగించాలన్నారు. అన్ని ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్, పీఈటీ పోస్టులు ఉండాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. విద్యాశాఖామంత్రి దృష్టికి సమస్య తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, కె.తేజేశ్వరరావు, ఎ.జగన్, ఎం.తేజేశ్వరరావు, డీవీఎన్ పట్నాయక్, జె.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

● దివ్యాంగ పింఛన్లు..

ఉంటాయో.. ఊడుతాయో!





- నేటి నుంచే ధ్రువపత్రాల పరిశీలన
- ప్రత్యేక వైద్య బృందాలు సిద్ధం
- ఇంటింటి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలన
- ఐదు నెలల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- ఆస్పత్రిలో సేవలకు అంతరాయం!



శ్రీకాకుళం:

జిల్లాలో భరోసా పింఛన్లు పొందుతున్న దివ్యాంగుల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. దివ్యాంగుల పింఛన్లు రూ.3వేలు నుంచి రూ.6వేలకు పెంచిన కూటమి ప్రభుత్వం ఆ భారం తగ్గించుకునే ప్రయత్నం చేపట్టింది. పింఛన్లు పొందుతున్న దివ్యాంగుల అంగవైకల్య ధ్రువీకరణ పత్రాలను పునఃపరిశీలించాలని వైద్యులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. జోన్-2 పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సోమవారం నుంచి వైద్య బృందాలు మండల స్థాయిలో పర్యటించి ధ్రువపత్రాలను పునఃపరిశీలన చేయనున్నారు.

యాప్‌లో నమోదు..

గతంలో సదరం ప్రక్రియను పక్కాగా నిర్వహించి ధ్రువపత్రాలు జారీ చేసినప్పటికీ కూటమి ప్రభుత్వం దానిని కాదని అనర్హుల పేరిట ఏరివేతకే కొత్త ప్రయత్నాలను ప్రారంభించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం ఓ యాప్‌ను సైతం రూపొందించింది. డాక్టర్లు పునఃపరిశీలన చేసిన తర్వాత ప్రత్యేక యాప్‌లో ప్రభుత్వం అడిగిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ యాప్‌లో వివరాలను నమోదు చేస్తే ఇప్పటికే ఉన్న దివ్యాంగ పింఛన్ లబ్ధిదారుల్లో 40 నుంచి 50 శాతం వరకు అనర్హులు అవుతారని వైద్యులే చెబుతుండటం గమనార్హం. మూడు జిల్లాల్లో 12 బృందాలను ఏర్పాటు చేయగా ఆయా వైద్యులు ప్రక్రియను పూర్తి చేసేందుకు సుమారు ఐదు నెలలు పడుతుందని సమాచారం. శ్రీకాకుళం జిల్లాలో సుమారు 31584 మంది దివ్యాంగ లబ్ధిదారులు పింఛన్లు పొందుతుండగా వీరిలో 8వేల మంది మంచానికే పరిమితమైన వారు ఉన్నారు. మొదటి విడతలో మంచానికే పరిమితమైన వారి వివరాలను సేకరిస్తారు. తర్వాత మిగిలిన వారి దివ్యాంగత్వాన్ని గుర్తించే ప్రక్రియ చేపట్టనున్నారు.

వైద్యసేవలు అంతేనా?

ఆస్పత్రుల్లోని వైద్యులు గ్రామాల్లో పరిశీలనకు వెళ్లడం వల్ల ఈ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు హాస్పిటల్స్‌లో వైద్య సేవలు అంతంత మాత్రంగా అందుతాయని రోగులు ఆందోళన చెందుతున్నారు. రిమ్స్ ఆస్పత్రిలో 60 మంది డాక్టర్లు ఉండగా వీరిలో 11 మంది పరిశీలనకు వెళుతున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మిగిలిపోనుంది. ప్రజారోగ్యాన్ని పక్కన పెట్టి లబ్ధిదారుల ఏరివేత లక్ష్యంగా ప్రభుత్వం భావిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



మరోవైపు పునఃపరిశీలన ప్రక్రియ పూర్తయ్యే వరకు సదరం ధ్రువపత్రాల జారీ ప్రక్రియ నిలుపుదల చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ప్రస్తుతం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ సైతం నిలిచిపోయింది. దీంతో సదరం ద్వారా ధ్రువపత్రాలు పొంది పింఛన్ అందుకోవాలని ఆశగా ఎదురుచూస్తున్న ఎంతోమంది దివ్యాంగుల ఆశలపై కూటమి ప్రభుత్వం నీల్లు చల్లింది. కొత్తగా పింఛన్లు పొందే అవకాశం లేకుండాపోయింది. మరో వైపు ఏరివేత ప్రక్రియ ప్రారంభం కావటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది.

రోగులకు ఇబ్బంది లేకుండా..



రిమ్స్‌కు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నాం. దివ్యాంగ పింఛన్లు ధ్రువపత్రాల నిర్ధారణ, లబ్ధిదారుల పరిశీలన కోసం ఆయా విభాగాల్లో ఉండే వైద్యుల సంఖ్యను బట్టి బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. రిమ్స్‌కు వచ్చే రోగులకు వైద్యం నిరంతరాయంగా అందుతుంది. – డాక్టర్ షకీల, రిమ్స్ సూపరింటెండెంట్, శ్రీకాకుళం

రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత

సాక్షి స్పందన



వినీతకు నగదు అందజేస్తున్న బూరవిల్లి గ్రామస్తులు

గార: మండలంలోని బూరవిల్లి గ్రామానికి చెందిన డిక్కల పద్మలోచన, వినీత దంపతుల చిన్న కుమారుడు చేతన్ గుండె వ్యాధితో, పెద్ద కుమారుడు శశాంక్ పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో సాయం చేసేందుకు దాతలు ముందుకొచ్చారు. గ్రామస్తులు, యువత, స్నేహితులు సేకరించిన లక్ష రూపాయలను ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్నారులకు దీర్ఘకాలిక వ్యాధులు సోకడంతో తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులపై 'హృదయ వేదన' పేరిట సాక్షిలో ఈ నెల 11న కథనం ప్రచురితమైంది. సంక్రాంతి సమయాల్లో కూడా విశాఖపట్నం ఆసుపత్రిలో ఉండటంతో ఆదివారం బూరవిల్లి వచ్చిన తల్లి వినీతకు సేకరించిన నగదును అందజేశారు. ఇప్పటివరకు రూ.10 లక్షల మేర ఖర్చు చేయడం, ఇంకా రూ.20 లక్షలు వరకు అవుతుందని వైద్యులు చెబుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. బోరవానిపేట సత్యసాయి భజనమండలి సభ్యులు రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.జనార్దన్, జి.ధర్మారావు, మల్ల రామారావు, ఎం.గోపి, మాధవనాయుడు, అయ్యప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేమన శతకాలు ఆచరణీయం



వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న రెడ్డిక సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజాకవి యోగి వేమన అని, ఆయన శతకాలు ఆచరణీయమని రెడ్డిక సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుక్క రాజశేఖరరెడ్డి అన్నారు. వేమన జయంతి సందర్భంగా ఆదివారం శ్రీకాకుళంలోని రెడ్డిక సంక్షేమ సంఘ కార్యాలయంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాకవిగా, సంఘ సంస్కర్తగా 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటంతో పద్యాలు రాసిన మహనీయుడు వేమన అని పేర్కొన్నారు. వేమన పద్యం తెలియని తెలుగు విద్యార్థి లేనడంలో అతిశయోక్తి లేదన్నారు. కప్పు మాధవ రెడ్డి మాట్లాడుతూ జీవనసారాన్ని తత్వాలుగా బోధించిన వేమన ఆరాధ్య కవిగానే కాదు ఆరాధ్య దైవంగానూ గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో అలపాన త్రినాథరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు నీలపు రామబాబురెడ్డి, ప్రొఫెసర్ దూడ విష్ణుమూర్తి రెడ్డి, బాకి వేణుగోపాలరెడ్డి, సూర్యరెడ్డి, పడపాన సుగుణారెడ్డి, రత్నకుమారి పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం



త్యాగయ్య చిత్రపటాలతో చిన్నారుల తిరువీధి



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

శ్రీకాకుళం కల్చరల్ : తరిణీ కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో సద్గురు త్యాగరాజస్వామి 178వ ఆరాధనోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. శృతిలయ సంగీత శిక్షణాలయం విద్యార్థులతో ఘనరాగ పంచరత్న కీర్తనలైన జగదానంద కారక (నాట రాగం), దుడుకుగల నన్నే దొర (గౌళ రాగం), సాధించెనే (ఆరభి రాగం), కనకన రుచిరా (వరాళీ రాగం), ఎందరో మహానుభావులు (శ్రీరాగం) చక్కగా గానం చేశారు. ముందుగా సి.వి.నాగజ్యోతి చారిటబుల్ ట్రస్టు అధినేత సి.వి.ఎస్.మూర్తి దంపతులు, వరసిద్ధి వినాయక పంచాయతన దేవస్థానం వ్యవస్థాపకులు జగన్మోహనరావు, రమాదేవి దంపతులు తిరువీధి ప్రారంభించారు. అనురాగనిలయం చిన్నారులు త్యాగయ్య వేషధారణలో తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో వాయులీనంపై దూసి రమేష్, బ్రహ్మాజీ, మృదంగంపై మండ శ్రీనివాసరావులు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, నిక్కు అప్పన్న, కనుగుల దుర్గా శ్రీనివాస్, ఎం.వి.కామేశ్వరరావు, బండారు రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

● జ్ఞాపకాల ఒడిలో..



బుడితి జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థులంతా దశాబ్దాల తర్వాత ఒకేచోటకు చేరారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తమతో కలిసి చదివి ప్రస్తుతం ఆర్థికంగా వెనుకబడిన వారికి చేదోడువాదోడుగా ఉండాలని తీర్మానించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సందడి చేశారు. ఆదివారం కొత్తూరు మండలం నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాల 1994–95 బ్యాచ్, సారవకోట మండలం బుడితి జెడ్పీ ఉన్నత పాఠశాల 1984–85 బ్యాచ్, నరసన్నపేట మండలం మాకివలస జెడ్పీ ఉన్నత పాఠశాల 1990–91 టెన్త్ బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఆయా స్కూళ్ల వద్ద ఘనంగా నిర్వహించారు.

– కొత్తూరు/సారవకోట/నరసన్నపేట



నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



మాకివలస జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

భారీ నగదుతో పట్టుబడిన పేకాటరాయుళ్లు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని హయాతినగరంలో పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. జూద మాడుతున్న 12 మంది వ్యాపారులను పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.11,13,440 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో పట్టణ సీఐ సీహెచ్ పైడపునాయుడు తెలిపారు. కాగా, ఇటీవలికాలంలో శ్రీకాకుళం రూరల్, గార, ఆమదాలవలస, ఎచ్చెర్ల పీఎస్‌ల పరిధిలో పేకాట శిబిరాలు జోరుగా నడుస్తున్నాయి. అధికార పార్టీ అండదండలతో అడ్డూఅదుపు లేకుండా శిబిరాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు అది నగరానికి సైతం పాకింది. ఆదివారం హయాతినగరంలో పట్టుబడిన వ్యాపారులు, దొరకని కొంతమంది ఎప్పటినుంచో నగరంలో సైతం రహస్యంగా పేకాట ఆడుతున్నారని, వీరి వెనుక అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉందన్న ప్రచారం గట్టిగా వినిపిస్తోంది. కొందరు పోలీసు సిబ్బంది సహకారంతో వీరికి ఉందన్న విషయం ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారి దృష్టికి వెళ్లడం.. ఇప్పటికే ఇలాంటి కార్యకలాపాల్లో ఆరితేరిన సిబ్బంది పోస్టింగ్‌లను వేరే చోటుకు వేయడం జరుగుతోంది.

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకొని కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు సమీపంలో జరుగుతున్న పేకాట శిబిరంపై ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఏడుగురిని పట్టుకుని 7 సెల్‌ఫోన్లు, రూ.11000 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస రెవెన్యూ పరిధిలో పేకాట శిబిరంపై జి.సిగడాం ఎస్‌ఐ వై.మధుసూదనరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.5640 స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఏఎస్‌ఐలు పొగిరి శంకరరావు, కొరుకొండ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

కానరాని యువకుడి ఆచూకీ



జంగం తరుణ్(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండల కేంద్రం వజ్రపుకొత్తూరుకు చెందిన యువకుడు జంగం తరుణ్ (16) శుక్రవారం తోటి స్నేహితులతో కలిసి సముద్ర స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే. యువకుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, మెరైన్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్న లభ్యం కాలేదు. తరుణ్ గల్లంతై మూడు రోజులు గడుస్తున్నా నేటికి ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. తీరంలో గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టి కుమారుడి ఆచూకీ కనిపెట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం



రోడ్డుపై ఉన్న స్నేహితుల మృతదేహాలు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఒడిశా యువకులు మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- అతివేగమే ప్రమాదానికి కారణం

ఇచ్ఛాపురం: అతివేగం ఇద్దరు ప్రాణస్నేహితులను ప్రాణాలను బలిగొంది. ఇచ్ఛాపురం పట్టణంలోని సంతపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా పాత్రపూర్ బ్లాక్ బొరివాడా గ్రామానికి చెందిన కాసులదేవి కార్తీక్(23), బొనసోలా గ్రామానికి చెందిన ఇసురు వినోద్(22) స్నేహితులు. కార్తీక్ హైదరాబాద్‌లో వెల్డర్‌గా, వినోద్ స్వగ్రామంలోనే మెకానిక్‌గా పని చేస్తున్నారు. సంక్రాంతి పండగ కోసం సొంతూరికి వచ్చిన కార్తీక్ ఒడిశాలో కొత్త బైక్‌ని కొనుగోలు చేశాడు. నంబర్‌ప్లేట్ కోసం ఆదివారం స్నేహితుడు వినోద్‌తో కలిసి బరంపురం వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా ఇచ్ఛాపురం పట్టణంలో సంతపేట వద్దకు చేరేసరికి అతివేగంతో బైక్‌ని నడపడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. అవతలవైపు రోడ్డులోకి సైతం దూసుకుపోయి మరో ద్విచక్రవాహనంపై వస్తున్న సోంపేట మండలం మాకన్నపురం గ్రామానికి చెందిన చిత్రాడ రమేష్, సిద్ధార్థ, పలాస మండలం తాలబద్రకు హనుమంత్ కార్తీక్‌లను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఒడిశాకు చెందిన ఇద్దరు స్నేహితులు అక్కడికక్కడే మృతిచెందగా రమేష్, హనుమంతు కార్తీక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సిద్ధార్థకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్సులో ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. హెచ్‌సీ అప్పారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మృతులు కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకొని బోరున విలపించారు.

కోర్టు కానిస్టేబుల్ విధులు కీలకం





సమావేశానికి హాజరైన కోర్టు లైజిన్ సిబ్బంది, పోలీస్ కానిస్టేబుళ్లు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: ప్రతి పోలీస్‌స్టేషన్‌లో కోర్టు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విధులు చాలా కీలకమని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. కోర్టులు, న్యాయస్థానాల మధ్య అనుసంధానంగా వ్యవహరించి నేరుస్తుల శిక్షల శాతం పెంచేలా శ్రమించడం కోర్టు కానిస్టేబుల్‌కే సాధ్యమని పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ స్టేషన్ల కోర్టు సిబ్బంది, కోర్టు లైజన్ సిబ్బందితో కేసుల విచారణ విధానం, వివిధ దశల్లో ఎదురవుతున్న సమస్యలు, సమన్లు, వారెంట్లు అమలు, సాక్షులను కోర్టులో హాజరుపర్చడం, కేసు అభియోగపత్రాల దాఖలు, ఇతరత్రా విధివిధానాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు నమోదు నుంచి తుది తీర్పు వరకు ప్రతి అంశాన్ని పూర్తి వివరాలతో సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రాసెస్‌ని ప్రతీరోజూ కేసు డైరీ రూపంలో జత చేయాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. సమావేశంలో డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆర్టీసీ కాంప్లెక్స్




రద్దీగా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ టికెట్ కౌంటర్లు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కిక్కిరిసింది. సంక్రాంతి పండగ ముగించుకుని స్వస్థలాలకు, గమ్యస్థానాలకు చేరుకునే క్రమంలో ప్రయాణికులతో కాంప్లెక్స్ కిటకిటలాడింది. వీరితో పాటు విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు, వసతి కేంద్రాలకు చేరుకునేందుకు లగేజీతో చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. టికెట్లు సకాలంలో దొరక్క ఆపసోపాలు పడ్డారు. ప్రయాణికులకు సరిపడా బస్సులను సమకూర్చడంలో భాగంగా పల్లెవెలుగు బస్సులను సైతం నాన్‌స్టాప్ బస్సులుగా బోర్డులు తగిలించి నడిపించేశారు.



కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

యువకుడు ఆత్మహత్య



గోరు ఖగేశ్వరరావు (ఫైల్)

నందిగాం: మండలంలోని పెద్దతామరాపల్లికి చెందిన గోరు ఖగేశ్వరరావు(22) ఆదివారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతామరాపల్లికి చెందిన చేనేత కార్మికుడు గోరు వెంకటరమణ, కుమారి దంపతులకు కుమారుడు ఖగేశ్వరరావు, కుమార్తె ఉన్నారు. ఖగేశ్వరరావు డిగ్రీ వరకు చదివాడు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. డిగ్రీ చదివినా ఏ పనీ చేయలేకపోతున్నానని ఆవేదన చెందేవాడు. ఈ క్రమంలో ఆదివారం తండ్రి పని కోసం బయటకు వెళ్లగా.. తల్లి కన్నవారింటికి కంట్రగడ వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఖగేశ్వరరావు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వీధిలో అటుగా వెళ్తున్నవారు గమనించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం హెచ్‌సీ జీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని బాలుడికి గాయాలు

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలో ఆరేళ్ల బాలుడు జిడ్డు కుమార్‌నాయుడు ఆడుతుండగా రోడ్డుపైకి రావడంతో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపు తప్పి ఢీకొట్టారు. ఈ ఘటనలో బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.